అనుగ్రహ పరిపూర్ణురాలు మరియతల్లి

- వేడుకగా లూర్దుమాత ఊరేగింపు





ఊరేగింపుగా వస్తున్న లూర్దుమాత, ప్రత్యేక అలంకరణలో లూర్దుమాత

కడపకల్చరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దేవునివాక్కు ప్రకారం మారు మాట్లాడకుండా నడచిన గొప్ప అనుగ్రమ పరిపూర్ణురాలు మరియతల్లి అని రెవరెండ్ ఫాదర్ బెన్ని (ఎస్వీడీ) కొనియాడారు. మరియాపురం లూర్ధుమాత తిరుణాలలో భాగంగా నిర్వహించిన నవదిన ప్రార్థనల్లో సోమవారం సాయంత్రం 5-30 గంటలకు మరియాపురం పాత చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. దివ్య బలిపూజ అనంతరం లూర్ధుమాతను అలంకరింపచేసి ప్రత్యేక వాహనంలో నగరంలో ఊరేగించారు. అనంతరం చిత్తూరు సీఎంఎస్ఎఎస్ డైరెక్టర్ ఫాదర్ గడికోట మనోహర్ స్వస్థతా ప్రార్థనలు, వాక్య పరిచర్య చేశారు. రాత్రి 10 గంటలకు కడప మేత్రాసనంలో విద్యాసంస్థల విద్యార్థులకు, విశ్వాసులకు క్రైస్తవ భక్తి నృత్యపోటీలు నిర్వహించారు. దివ్య బలిపూజను వికార్ జనరల్ ఫాదర్ తలారి బాలరాజు నిర్వహించారు.

దొంగతనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం

- బస్టాండులో సీసీ కెమెరాలు పునరుద్ధరించండి
- ఖాజీపేట పోలీసు స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ



ఖాజీపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

ఖాజీపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న దొంగతనాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా వారిలో చైతన్యం తేవాలన్నారు. వేసవి కాలంలో దొంగతనాలు జరగకుండా గస్తీ నిర్వహించాలని, సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని పెండింగ్ కేసులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని, విజబుల్ పోలిసింగ్‌లో భాగంగా గ్రామాలకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడంతో పాటు రాత్రివేళల్లో అక్కడ నిద్రిస్తే గ్రామంలోని సమస్యలు వారి దృష్టికి వస్తాయన్నారు. క్రికెట్ బెట్టింగ్, అసాంఘిక కార్యక్రమాలు, మట్కా, గ్యాంబ్లింగ్ జరుగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. బస్టాండులోని సీసీ కెమెరాలను వెంటనే పునరుద్ధరించాలని నిఘా నేత్రాల వలయంలో బస్టాండు కూడలి ఉండాలని అన్నారు. అలాగే స్కూళ్లు, కాలేజీల వద్ద ఈవ్‌టీజింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. శివరాత్రిని పురస్కరించుకుని దేవాలయాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషన్‌లోని సిబ్బందితో చర్చించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వృత్తిపరంగా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ మోహన్, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కళ తప్పిన నాటకరంగం

- అలనాటి తోలుబొమ్మలాట, వీధి భాగవతాలకు ఆదరణ కరువు
- జీవనోపాధి కోల్పోయిన కళాకారులు
- పెన్షన్ మంజూరు కాలేదంటూ ఆవేదన

6

దాహార్తికి చెక్..!



- వాటర్‌గ్రిడ్ కోసం రూ.2,790 కోట్లు
- ప్రాజెక్టుల వారీగా అంచనాల రూపకల్పన
- పూర్తయితే.. జలాశయాల నుంచి రోజంతా తాగునీరు

(కడప-ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే చాలు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కోసం జనానికి తీవ్ర ఇక్కట్లు తప్పడం లేదు. ప్రతి వేసవిలో ట్యాంకర్ల ద్వారా, వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకోవడం, బోర్లు వేసి తాత్కాలికంగా ఆ గండం నుంచి గట్టెక్కేవారు. ఆ అరకొర నీళ్ల చాలక జనం అవస్థలు పడేవారు. పశువులకు గడ్డి కాదుకదా.. కనీసం కడుపు నిండా నీళ్ల కూడా తాపలేని పరిస్థితి ఎదుర్కొనేవారు. ఈ కష్టాలకు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి సర్కారు చెక్ పెట్టాలని నిర్ణయించింది. రిజర్వాయర్ల ద్వారా రోజంతా నీటి సరఫరా అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు అంచనాలు రూపొందించారు. జిల్లాలో రూ.2,790 కోట్ల వ్యయంతో వాటర్‌గ్రిడ్ పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఇక తాగునీటి సమస్య అనేమాటే తలెత్తదు. 2014-19లోనే చంద్రబాబు హయాంలో వాటర్‌గ్రిడ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి ఉమ్మడి జిల్లాలో రూ.1,500 కోట్ల వ్యయంతో టెండర్లు కూడా పిలిచారు. అయితే టీడీపీ ఓడిపోయి జగన్ ప్రభుత్వం రావడంతో ఆ పనులను అటకెక్కించింది. అప్పటి నుంచి ఏటా తాగునీటి సమస్య మాత్రం తప్పడంలేదు.

జిల్లాలో 1,992 హ్యాబిటేషన్లు ఉన్నాయి. ఈ హ్యాబిటేషన్ల పరిధిలోని జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 13.51 లక్షల జనాభా ఉంది. 553 గ్రామ పంచాయతీలున్నాయి. నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి మనిషికి రోజువారి అవసరాలకు 55 లీటర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉంది. అయితే ఇప్పుడంతా వాటర్ స్కీంలపై ఆధారపడడంతో రోజూ అందరికీ సరిపడా నీరు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

రిజర్వాయర్ల ద్వారా...

గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యకు రిజర్వాయర్ల నుంచి నీటిని తీసుకెళ్లడం ఒక్కటే శాశ్వత పరిష్కారం. అందుకు తగ్గట్లుగానే బ్రహ్మంసాగర్, మైలవరం, గండికోట, తెలుగుగంగ, సోమశిల ప్రాజెక్టుల నుంచి తాగునీరు అందించాలని నిర్ణయించారు. ప్రాజెక్టుల వారీగా అంచనాలు రూపొందించారు.

బ్రహ్మంసాగర్: బ్రహ్మంసాగర్ నుంచి బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల్లోని కాశినాయన, బి.కోడూరు, పోరుమామిళ్ల, కలసపాడు, బి.మఠం, మైదుకూరు. ఖాజీపేట మండలాల పరిధిలో ఉన్న 617 హ్యాబిటేషన్లలోని 2,99,999 మంది జనాభాకు నీరు ఇవ్వనున్నారు. బ్రహ్మంసాగర్ సామర్థ్యం 17.74 టీఎంసీలు. ఈ ప్రాజెక్టు నుంచి 0.2961 టీఎంసీలను తాగునీటి కోసం వినియోగిస్తారు. ఇందుకోసం రూ.660 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు.

మైలవరం: జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గాల్లోని పెద్దముడియం, జమ్మలమడుగు, మైలవరం, ప్రొద్దుటూరు రాజుపాలెం మండలాల్లో 157 హ్యాబిటేషన్లలో 1,98,777 మందికి నీరందిస్తారు. ఈ ప్రాజెక్టు సామర్థ్యం 9.98 టీఎంసీలు. ఇక్కడ నుంచి 0.1756 టీఎంసీల నీటిని తాగునీటికి అందిస్తారు. అంచనా వ్యయం రూ.380 కోట్లు.


గండికోట: గండికోట రిజర్వాయరు నుంచి జమ్మలమడుగు, కమలాపురం నియోజకవర్గాల్లోని ముద్దనూరు, ఎర్రగుంట్ల, వీఎన్‌పల్లె, పెండ్లిమర్రి, వల్లూరు, సీకేదిన్నె, చెన్నూరులోని 479 హ్యాబిటేషన్లలో 2,99,826 మందికి నీరిస్తారు. ఈ ప్రాజెక్టు సామర్థ్యం 26.88 టీఎంసీలు. ఇక్కడ నుంచి 0.3083 టీఎంసీల నీటిని తాగునీటికోసం తరలిస్తారు. అంచనా వ్యయం రూ.750 కోట్లు.

ఎస్ఆర్-1: తెలుగుగుంగ ఎస్ఆర్-1 నుంచి మైదుకూరు నియోజకవర్గంలోని దువ్వూరు, చాపాడు మండలాల్లో 104 హ్యాబిటేషన్లలో 93,174 మందికి నీరందిస్తారు. దీని సామర్థ్యం 2.13 టీఎంసీలు. ఇక్కడ నుంచి 0.0892 నీటిని తాగునీటికోసం తీసుకెళ్తారు. అంచనా వ్యయం రూ.245 కోట్లు.

సోమశిల: సోమశిల నుంచి బద్వేలు, రాజంపేట నియోజకవర్గాల్లోని గోపవరం, బద్వేలు, అట్లూరు, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లోని 183 గ్రామాల్లో 66,955 మందికి నీటిని అందిస్తారు. ఈ ప్రాజెక్టు సామర్థ్యం 72 టీఎంసీలు. ఇక్కడ నుంచి 0.0761 టీఎంసీల నీటిని అందిస్తారు. ఇందుకోసం రూ.766 కోట్లు అంచనా వేశారు. ఇక పులివెందులలో ఇప్పటికే రూ.480 కోట్లతో వాటర్‌గ్రిడ్ పనులు సాగుతున్నాయి. అధికారుల అంచనా మేరకు ఈ వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు పూర్తయితే జిల్లాలో తాగునీటి సమస్య ఉండదు.

నేటి నుంచి

విజయదుర్గాదేవి వార్షిక బ్రహ్మోత్సవాలు



విద్యుత్ దీప కాంతులతో మెరిసిపోతున్న విజయదుర్గాదేవి ఆలయం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుధా మల్లికార్జున, సుధా దుర్గాప్రసాద్

కడప కల్చరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని బిల్టప్ సమీపంలో ఉన్న విజయదుర్గాదేవి ఆలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 11వ తేదీ మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆ ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, ఆలయ నిర్వాహకులు సుధా దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తొలుత వార్షిక బ్రహ్మోత్సవాల తాలూకు వివరాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఇప్పటికే ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశామన్నారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ భక్తిశ్రద్ధలతో పూర్తిచేశామన్నారు. మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు ప్రతి రోజూ అమ్మవారికి విశేష అభిషేకాలు, చండీహోమం, శ్రీచక్రార్చన జరుగనున్నాయన్నారు. 14వ తేదీ శుక్రవారం మాఘ బహుళ విదియనాడు సాయంత్రం 4 గంటలకు విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణం జరుగనుందన్నారు. అనంతరం రాత్రి 8 గంటల నుంచి అమ్మవారికి నగరోత్సవం నిర్వహిస్తామన్నారు.

గీత కులాలకు మద్యం షాపులు కేటాయింపు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గీత కులాలకు సంబంధించి 14 మద్యం షాపులను కేటాయించామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గీత కులాలకు లాటరీ పద్ధతిలో మద్యం షాపుల కేటాయింపు జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 2024-26 సంవత్సరాలకు గీత కులాల వారికి మద్యం షాపులను లాటరీ ద్వారా పారదర్శకంగా కేటాయించామన్నారు. గీత కులాలకు సంబంధించి ఈడిగ, గౌడ, గౌండ్ల, గౌడ్ కులాల వారిని మద్యం షాపులకు ఎంపిక చేశామన్నారు. జిల్లాలో గీత కులాలకు సంబంధించి 14 మద్యం షాపులకు 162 దరఖాస్తులు రాగా వాటిని లాటరీ పద్ధతిలో ఎంపిక అయిన వ్యక్తులకు పారదర్శకంగా కేటాయించామన్నారు. కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, మైదుకూరు, బద్వేలు, ఎర్రగుంట్లలో మద్యం దుకాణాలు కేటాయించామని జేసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు, సూపరింటెండెంట్ రవికుమార్, అసిస్టెంట్ ఆఫీసరు వినోద్ కుమార్‌నాయక్, సీఐ కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి



- జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ అదితి సింగ్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి వచ్చి ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో అర్జీలు సమర్పించే బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో ప్రజా ఫిర్యాదుల(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున వచ్చిన ప్రజలు జాయింట్ కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. అర్జీలను స్వీకరించిన మీదట తదుపరి చర్యలకై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అర్జీదారులను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పొద్దని, ఫిర్యాదులను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయికి అధికారులు స్వయంగా వెళ్లాలన్నారు. పారదర్శకంగా విచారణ చేపట్టి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, డీఆర్డీయే పీడీ ఆనంద్ నాయక్, ఎస్డీసీలు శ్రీనివాసులు, వెంకటపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీల నమోదు వద్ద గందరగోళం

జిల్లా నలుమూలల నుంచి పీజీఆర్ఎస్‌లో అర్జీలు సమర్పించేందుకు వచ్చిన బాధితుల అర్జీలు ఆన్‌లైన్ చేయడానికి సిబ్బంది అవస్థలు పడ్డారు. సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో ఆన్‌లైన్ ప్రక్రియకు చాలా సమయం పట్టింది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు తొందరగా ఊరెళ్లేందుకు నేను ముందు, నేను ముందు అంటూ వాగ్వాదానికి దిగారు. తోపులాట జరిగింది. దీంతో కొంత సేపు గందగోళ పరిస్థితి ఏర్పడింది. పీజీఆర్ఎస్ నమోదు కేంద్రం వద్ద పోలీసులను ఏర్పాటు చేయాలని అర్జీదారులు కోరారు.



ఆన్‌లైన్ జాప్యంతో కిక్కిరిసిన పీజీఆర్ఎస్



ఆన్‌లైన్ నమోదులో మొరాయించిన సర్వర్

పన్ను వసూళ్లలో అలసత్వం

- పేరుకుపోయిన బకాయిలు
- రూ.13 కోట్ల మేర ఇంటి పన్నులు..
- రూ.4.88 కోట్ల నీటి పన్నులు వసూళ్లు కాని వైనం
- వందల మంది మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఉన్నా నిర్లక్ష్యం
- చర్యలకు సిద్ధం కాని మున్సిపల్ అధికారులు
- 50 రోజుల వ్యవధిలో వందశాతం వసూలయ్యేనా..

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పన్ను వసూళ్లలో అలసత్వం కారణంగా రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోయాయి. ఇంటి, నీటి పన్ను వసూళ్లు చేయాల్సిన సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం, మున్సి పల్ అధికారులు పర్యవేక్షణ కొరవడటంతో మున్సిపాలి టీలో అభివృద్ధి పనులతో పాటు ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ ఆర్థిక ఏడాది 50 రోజుల వ్యవధిలో ముగుస్తుంది. ఈ లోపు వంద శాతం వసూళ్లు సాధ్యమయ్యేనా... మున్సిపాలిటీ సమస్యల నుంచి గట్టెక్కేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ప్రజల సమస్యలు తీర్చా లంటే నిధులు ముఖ్యం. పట్టణంలో నిత్యం పారిశుధ్య పనులు చేపట్టడానికి వందలాది మంది పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాల్సి వుంటుంది. అలాగే ఇంటింటి నుంచి పోగయ్యే చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడానికి కంపాక్టర్లు, ట్రాకర్లు, ఆటోలకు డీజిల్ ఖర్చు వుంటుంది. అలాగే వీధి దీపాల నిర్వహణతో పాటు వాటి మరమ్మతులకు ఖర్చులు అవుతాయి. రోడ్లు, కాలువల నిర్మాణానికి కోట్ల రూపాయల నిధులు లేనిదే అభివృద్ధి సాధ్యం కాదు. మున్సిపాలిటీకి ఇంటి, నీటి, ప్రకటనల పన్నులతో బిల్డింగ్ లైసెన్సు, ట్రేడ్ లైసెన్సు ఫీజులు, మార్కెట్ లీజు, మున్సిపల్ వాణిజ్య గదుల అద్దెలు, ఎగ్జిబిషన్ స్థలం లీజు వంటి వాటితో వచ్చే ఆదాయంతో అభివృద్ధి పనులతో పాటు మున్సిపాలిటీలో ఉద్యోగులకు జీత భత్యాలు చెల్లించాల్సి వుంటుంది. పన్నులు సకాలంలో వసూళ్లు కాకుంటే అభివృద్ధి ఏమో గానీ కనీసం ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంటుంది. ఈ స్థితి రాకుండా వుండాలంటే మున్సిపల్ సిబ్బంది చేత పన్ను వసూళ్లు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాల్సి వుంటుంది.

రూ.13 కోట్ల ఇంటి పన్ను బకాయిలు

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఇంటి పన్ను అసెస్‌మెంట్లు 34,367 వున్నాయి. వీటికి కరెంట్ డిమాండ్ రూ.20.93 కోట్లు వుంది. 2024-25 మార్చి 31 నాటికి డిమాండ్ రూ.26.04 కోట్లు వుండగా ఇప్పటి వరకు రూ.13.06 కోట్లు వసూలైంది. ఇంకా రూ.13 కోట్లు వసూళ్లు కావాల్సి వుంది. ఇందులో 2024-25 సంవత్సరానికి సంబంధించి మార్చి 31 నాటికి రూ.20,93,28,147 బకాయి వుంది. 2023-24కు సంబంధించి బకాయిలు 10,56,27,347 వసూళ్లు కావాల్సి వుంది. ఇందులో ప్రభుత్వ భవనాలకు సంబంధించి 2024-25 కరెంట్ డిమాండ్ రూ.66,22,772 వుండగా అరియర్స్ రూ.2,50,52,438 వుంది.

నీటి పన్ను బకాయిలు రూ.4.88 కోట్లు

మున్సిపాలిటీలో నీటి పన్ను అసెస్‌మెంట్లు 23,943 వున్నాయి. వీటికి రూ.2.87 కోట్లు డిమాండ్ వుంది. 2024-25కు సంబంధించి కరెంటు డిమాండ్ రూ.2.78 కోట్లు వుండగా ఇప్పటి వరకు కరెంట్ అరియర్స్ కలిపి రూ.4.88 కోట్లు నీటి పన్ను బకాయిలు వున్నాయి. ఇంటి పన్నులు రూ.13కోట్లతో పాటు నీటి పన్ను రూ.4.88 కోట్లతో కలిపి రూ.18 కోట్ల మేర పన్ను బకాయిలు వున్నాయి.

పన్ను వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్

మున్సిపాలిటీలో ఇంటి, నీటి పన్నులతో పాటు వాణిజ్య గదుల అద్దె వసూళ్ల కోసం సచివాలయ సిబ్బందితో పాటు రెవెన్యూ అధికారులు స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొంటున్నారు. ప్రతి రోజు వసూళ్లకు టార్గెట్ ఇచ్చాం. మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు సైతం జారీ చేశాం. త్వరలో ఆస్తుల జప్తులు చేసే చర్యలు చేపట్టబోతున్నాం. నీటి పన్ను చెల్లించకుంటే కొళాయి కనెక్షన్ కూడా తొలగిస్తాం.

-శ్రీనివాసరావు, మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్, ప్రొద్దుటూరు.

420 మందికి రెడ్ నోటీసులు

మున్సిపాలికి ఇంటి పన్ను బకాయిలు వున్న వారిలో లక్షకు పైగా బకాయిలు ఉన్న 420 మందికి రెడ్ నోటీసులు జారీ చేశారు. 15 రోజుల్లోపు నోటీసులకు స్పందించక పోతే వారి ఆస్తులు సీజ్ చేస్తామని అధికారులు వెల్లడిస్తున్నారు. ఇక ఇంటి పన్ను బకాయిల్లో టాప్ 100లో వున్న వారి జాబితాను సిద్ధం చేసి నోటీసులు ఇచ్చారు. వీరిలో మైదుకూరు రోడ్డులో ఏకంగా రూ.71 లక్షలు పన్ను బకాయిలు వున్న వారు వున్నారు. వారి ఆస్తులు రేపో మాపో సీజ్ చేయడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. అలాగే రూ.10 లక్షలకు పైగా వున్న వారి ఆస్తులు సీజ్ చేయడానికి కూడా నోటీసులు ఇచ్చారు. నోటీసులకు స్పందించకుంటే వెంటనే వారి ఆస్తులు సీజ్ చేస్తామని ప్రకటిస్తున్నారు.



మున్సిపల్ కార్యాలయం

వసూళ్లలో సచివాలయ ఉద్యోగుల అలసత్వం

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో 46 సచివాలయాలు వుండగా.. 450 మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇంత మంది సచివాలయ సిబ్బంది ఉన్నా ఇంటి, నీటి పన్నుల బకాయిలు ఇంకా పేరుకుపోవడం దారుణం. ఇప్పటికైనా మున్సిపల్ రెవెన్యూ అధికారులతో పాటు కమిషనర్ వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ పెట్టి రోజు వసూళ్లు చేయాల్సి వుంటుంది.

50 రోజుల్లో రూ.కోట్లు వసూలయ్యేనా..

మార్చి 31 నాటికి 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. ఈ రోజుతో మొదలు పెడితే మార్చి 31కి కేవలం 50 రోజుల వ్యవధి వుంది. రోజూ లక్షల్లో వసూళ్లు చేస్తే తప్ప ఇంటి, నీటి పన్నుల బకాయిలు వసూళ్లు కావు. అయితే పన్ను బకాయిదారులు పన్ను బకాయి మీద వున్న వడ్డీని మార్చిలో మాఫీ చేస్తారనే ఎదురుచూస్తున్నారు. కానీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రీత్యా వడ్డీ మాఫీ ఉండకపోవచ్చని మున్సిపల్ అధికారులు వెల్లడిస్తున్నారు.

హెల్పింగ్ మైండ్స్

- వారి ఆలోచనే సేవకు మూలం
- ఆరుగురితో మొదలై 18 వేలకు చేరిన సంఖ్య
- కరోనాలో 917 మృతదేహాలకు అంత్యక్రియలు

పెద్దమండ్యం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వారి ఆలోచనే సేవకు మూలం. ఎదుటి వారికి సహాయం చేయాలన్న తలంపే 'హెల్పింగ్‌మైండ్స్'గా రూపాంతరం చెందింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సేవ చేయాలన్న ఆలోచనతో రక్తదానంతో మొదలైన సేవ రక్తం కోసం వెదికేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించే వరకు వెళ్లింది. ఫలితంగా ఏ ప్రాంతంలో ఉన్న వారికి రక్తం అవసరమన్నా యాప్ ద్వారా పొందవచ్చు. ఫలితంగా సేవకులు ఆపద్బాంధవులుగా కొనియాడబడుతున్నారు. 2013 ఏప్రిల్ 7వ తేదీ ఆరుగురితో మొదలైన హెల్పింగ్‌మైండ్స్ ప్రయాణంలో ప్రస్తుతం 18 వేల మంది సభ్యులు, 25 వేల మంది రక్తదాతలు ఉన్నారు.


పెళ్లిలో రక్తదానం చేస్తున్న అబూబకర్ సిద్దిక్ (ఫైల్)


కరోనాలో అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు చేస్తున్న హెల్పింగ్ మైండ్స్ సభ్యులు (ఫైల్)



అనాథలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు (ఫైల్)

రక్తదానంతో ప్రాణదానం

అన్ని దానాల కన్నా రక్తదానం మిన్నగా చెప్పవచ్చు. ఎందుకంటే రక్తదానం ప్రాణదానంతో సమానం కాబట్టి. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, శస్త్రచికిత్సల సమయంలో రక్తం అవసరం ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో రక్తం అందుబాటులో లేకపోవడంతో అనేకమంది మృత్యువాతపడుతున్నారు. అలాంటి వారిని ఆదుకునేందుకు తమ వంతుగా రక్తాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం సొంత బంధువులకు కూడా సాయం చేసేందుకు వెనకడుగు వేస్తున్న పరిస్థితుల్లో మేమున్నామని భరోసా ఇస్తూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడుతూ అందరి చేత ప్రశంసలను అందుకుంటున్నారు. చాలామంది ఒకటి, రెండు, మూడుసార్లు రక్త దానం చేసి ఉంటారు. కానీ హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు అయితే కొందరు 40 సార్లకు పైగా రక్తదానాలు చేసి ప్రజల ప్రాణాలు కాపాడి ఆదర్శంగా నిలిచారు. మదనపల్లిలోని 'హెల్పింగ్ మైండ్స్' సభ్యులు రక్తదానం చేయడమే కాకుండా రక్తదాన శిబిరాలు సైతం ఏర్పాటు చేయడం దేశవ్యాప్తంగా రక్తం అవసరాలను దృష్టిలో ఉంచుకుని గూగుల్ ప్లేస్టోర్‌లో హెల్పింగ్ మైండ్స్ సొసైటీ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. అందులో రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చే ప్రతిఒక్కరూ తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఏ ప్రాంతంలో రక్తం అవసరం ఉంటుందో ఆ ప్రాంతాల వారు యాప్ ద్వారా రక్తదాతలను గుర్తించి సాయం పొందేలా రూపొందించారు. హెల్పింగ్ మైండ్స్ సంస్థకు కరోనా సమయంలో సేవలకు ప్రస్తుతం ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అప్పుడు మదనపల్లి టీడీపీ నేతల ద్వారా ప్రశంసాపత్రం అందజేశారు.


జాతీయ రక్తదాన దినోత్సవం రోజు రక్తదానం చేస్తున్న పోలీసులు, సంస్థ సభ్యులు (ఫైల్)

హెల్పింగ్ మైండ్స్ సేవలు విస్తృతం

హెల్పింగ్ మైండ్స్ సభ్యులు మరిన్ని సేవలను విస్తృతం చేశారు. ప్రధానంగా కరోనా సమయంలో కరోనాకు భయపడి బంధువులకు దూరమైన 917 మృతదేహాలకు వారి సంప్రదాయ పద్ధతుల్లో అంత్యక్రియలు నిర్వహించడం విశేషం. చదువుకునే వయస్సులో సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. వేసవి వచ్చిందంటే దాహార్తి తీర్చడానికి అవసరమైన చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారు. 40 డిగ్రీల ఉష్ణోగ్రతతో అడవిలో జీవులు మరణించకూడదని వందల సంఖ్యలో తాగునీటి తొట్టెలు ఏర్పాటు చేసి వాటిని నీటితో నింపుతున్నారు. హిందువుల ముఖ్యమైన పండుగల్లో వినాయకచవితి సందర్భంలో ఏటా భక్తులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు అందజేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. సీజన్‌లో అయ్యప్పస్వామి మాల ధరించిన భక్తులకు ఆనవాయితీగా అన్నదానం కార్యక్రమాలు జరుగుతున్నాయి. నిరుపేదలకు గుప్పెడు అన్నం అందించడానికి మదనపల్లి ఆర్టీసీ బస్టాండ్, గుర్రంకొండల్లో ఫుడ్ బ్యాంక్ ఏర్పాటు చేశారు. రోజూ వందమందికి అక్కడ ఫ్రీహబ్‌లలో ఆహార పొట్లాలు ఉంచుతారు. గృహ శుభకార్యాలు, పుట్టినరోజులు, పెళ్లిళ్లు మిగిలిన అన్ని రకాల కార్యక్రమాల్లో మిగిలిన అన్నం పొట్లాలు నిల్వ చేస్తారు. నిరుపేదలు ఆకలితో ఉండకూడదన్న హెల్పింగ్ మైండ్స్ లక్ష్యం విజయవంతంగా నడుస్తోంది. చలికాలంలో అనాథలకు దుప్పట్లు పంపిణీ సేవలు సాగుతున్నాయి. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా విగ్గులు అందజేస్తున్నారు. దేశవ్యాప్తంగా హెల్పింగ్ మైండ్స్ సంస్థ సేవలు విస్తరించి రాయలసీమకే వన్నె తెచ్చారు. వారి సేవలు సద్వినియోగం చేసుకోవాలని హెల్పింగ్ మైండ్స్ సంస్థ కోరుకోవడం విశేషం.

పెళ్లిలో కూడా రక్తదానం

మదనపల్లిలో స్థిరపడిన హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకుడు పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన అబూబకర్ సిద్ధిక్ పెళ్లిలో కూడా రక్తదానం చేయడం విశేషం. వివాహ సమయంలో పెళ్లి కుమారుడు సహా మరో 52 మంది సభ్యులు రక్తదానం చేసిన హెల్పింగ్ మైండ్స్ సభ్యులు అందరి ప్రశంసలు అందుకున్నారు.

ఏ ఒక్కరి ప్రాణం పోకూడదు



రక్తం అందుబాటులో లేకపోడం వల్ల ఏ ఒక్కరూ మృత్యువాతపడకూడదన్న లక్ష్యంతోనే పదేళ్ల కిందట హెల్పింగ్ మైండ్స్ రక్తదాతల సంఘాన్ని ఏర్పాటు చేశాం. ఇందులో వేల సంఖ్యలో దాతలు చేరారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా, అన్నమయ్య, కడప బెంగళూరు, తిరుపతి, పంజాబ్, హైదరాబాదు నగరాలు సహా పలు ప్రాంతాల్లో హెల్పింగ్ మైండ్స్ సేవలు విస్తరించాం ఈ సంస్థ ద్వారా 25 వేల మందికి రక్తదానం చేశాం. గూగుల్ ప్లేస్టోర్‌లో యాప్‌ను తయారు చేశాం. ఇప్పటి వరకు 40 సార్లు రక్తదానం చేశాను. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సాయం అందివ్వాలి. కరోనా సమయంలో ప్రస్తుతం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశంసాపత్రం ఇవ్వడం మరవలేనిది.

-అబూబకర్ సిద్ధిక్,
హెల్పింగ్ మైండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు, మదనపల్లి.

గంజాయి గుట్టురట్టు...

- 2.25 కిలోల గంజాయి సీజ్
- ఆరుగురు అరెస్టు
- 5 సెల్‌ఫోన్‌లు, రూ.20వేలు నగదు స్వాధీనం


గంజాయితో పట్టుబడిన నిందితులను చూపుతున్న పోలీసులు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):ఎట్టకేలకు గంజాయి గుట్టు రట్టు అయింది. గత మూడు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన గంజాయి పీల్చేస్తున్నారు అన్న కథనంపై జిల్లా పోలీసు యంత్రాంగం స్పందించింది. ఆ మేరకు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ పర్యవేక్షణలో వాల్మీకిపురం పోలీసులు గత రెండు రోజుల పాటు విస్తృత దాడులు నిర్వహించారు. స్థానిక సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ చంద్రశేఖర్‌లకు వచ్చిన రహస్య సమాచారంతో రెండు రోజుల నుంచి ముమ్మర నిఘా చేపట్టడంతో గంజాయి గుట్టు రట్టయింది. పట్టణ శివారులోనే ఎక్కడి నుంచి వస్తుందో తెలియదు కానీ విక్రయాలు సాగిస్తున్న వ్యక్తులను పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకోవడం గమనార్హం. స్థానిక సాకలవారిబండకు చెందిన కాలపల్లె అంజమ్మ(54), ఇందిరమ్మ కాలనీకి చెందిన సయ్యద్ ఖలీల్(43),దయ్యాలడండకు చెందిన ఎస్.సమీర్(34), కత్తి సిద్దార్థ(19), నమాజ్‌కట్టవీధికి చెందిన నిమ్మనపల్లె కిరణ్(19)లతో పాటు మరో యువ కుడు ఆదివారం మధ్యాహ్నం పట్టణ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో గుంపుగా ఉండటం అనుమానించిన పోలీసులు వారి వద్దగల ప్లాస్టిక్ సంచులను చోదా చేయడంతో గంజాయి విక్రయాల విషయం బయట పడింది. ఈ తనిఖీలలో 2.250 కేజీల గంజాయిని సీజ్ చేస్తూ 5సెల్‌ఫోన్లు, రూ.20వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కాగా పట్టుబడ్డ వ్యక్తులలో మహిళ బయటి ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకువచ్చి వాల్మీకిపురం ప్రాంతం చుట్టుపక్కల విక్రయాలు కొనసాగిస్తున్నట్లు పోలీ సుల విచారణలో తేలింది. ఈ మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు. గంజాయి పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించారు. ఈ దాడులలో అదనపు ఎస్ఐ శ్రీహరి, ఏఎస్ఐ కరీముల్లాసాహెబ్, హెడ్‌కానిస్టేబుళ్లు వేణుగోపాల్, దస్తగిరి, ఆదినారాయణ, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుళ్లు మోహన్‌బాబు, సిబ్బంది అబ్దుల్లా, లక్ష్మీపతి, రెడ్డిప్రసాద్, శివకుమార్, నరేష్, గిరిబాబు, బాబాప్రసాద్, రిజ్వాన్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి..

మాదక ద్రవ్యాల విషయంలో యువత పెడదోవ పట్టి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వారి పట్ల తల్లిదండ్రులు తప్పక బాధ్యతగా వ్యవహరించాలని వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. తమ కష్టాలతో వ్యవప్రయాసలు పడి పిల్లల భవిష్యత్తు కోసం అన్నీ సమకూర్చే తల్లిదండ్రులు పిల్లలు ఎటు పోతున్నారో ఏమి చేస్తున్నారు విషయాల పట్ల ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. చదువు విషయంలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్తున్నారా ఏమిచేస్తున్నారు, ఎలా చదువుకుంటు న్నారన్న వాటిపై పర్యవేక్షణ లేకపోతే తర్వాత బాధపడాల్సి వస్తుందన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. సర్కిల్ పరిధిలోని గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాలలో గంజాయి విక్రయాలు, వాటిని సేవించే వారు ఎంతటి వారైనా ఇకపై ఉపేక్షించేది ఉండదని చట్టరీ త్యా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమాజంలో ప్రజలంతా కూడా బాధ్యత ఎరిగి ఇలాంటి సంఘ వ్యతిరేక కార్యకలాల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

- తిరుచ్చిపై తిరుమాడ వీధులలో నగరోత్సవం


వాల్మీకిపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో సోమవారం పునర్వసు శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు టీటీడీ ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ మొదలు ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. నూతన వధూవరులైన సీతారాములకు విశేష అలంకరణలు గావించి ఆలయ మండపంలో మామిడి తోరణాలు, పుష్పాలంకరణలతో ముస్తాబు చేసిన కల్యాణ వేదికపై ఆశీనులు గావించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణలు, విశేష భక్తజనం నడుమ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా సాగింది. అనంతరం హోమాది కార్యక్రమాలు పూర్ణాహుతి గావించి వేడుకలు పూర్తి చేశారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులు, భక్తులకు టీటీడీ వస్త్రం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయం త్రం భోగోత్సవమూర్తులైన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను తిరుచ్చిపై అలంక రణలు గావించి తిరుమాఢ వీధులలో నగరోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు భాషికాచార్యులు, ధనుష్‌భట్టార్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 16 మందికి జరిమానా

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన షేక్. జాఫర్, తులసి ప్రసాద్, శైకలియాస్, సైడ్ సాయివల్లితోపాటు మరో 12 మందిని రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరు పర్చగా మేజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ.10,500లు చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ విశ్వనాథ రెడ్డి తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారని వివరించారు.

కాలువలో పడి వృద్ధుడు మృతి


మృతుడు కృష్ణప్ప (ఫైల్)

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలువలో పడి కృష్ణప్ప (62) అనే వృద్ధుడు మృతి చెందినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మదనపల్లె మండలం, పొన్నూటి పాలెం మోట్లపల్లెకు చెందిన కృష్ణప్ప కూలీ పనులకు వెళుతూ పనసమాకులపల్లెలో ఒక రోజు ఒక్కో ఇంట్లో భోజనాలు చేస్తూ జీవిస్తున్నట్లు తెలిపారు. మద్యం తాగే అలవాటు ఉండడంతో వారం నుంచి కనపడడంలేదని తెలిపా రు. సోమవారం కాలువలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి తాలుకా పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోర్టుమార్టం కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇతనికి కుమారుడు శంకర్, మనుమడు ఉన్నట్లు తెలిపారు.

విజయవంతంగా ఎస్‌డీడీ ప్రోగ్రాం

- ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ


చిన్నారికి అల్బెండజోల్ మాత్ర వేస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన ఎన్‌డీడీఆ (జాతీయ నులిపురుగుల నిర్మూలన) కార్యక్రమం విజయవంతం అయ్యిందని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ తెలిపారు. రాయచోటిలోని మాసాపేట-3 అంగన్వాడీ కేంద్రంలో, విశ్వభారతి స్కూల్‌లో మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులకు అల్బెండజోల్ 400 మి.గ్రా మాత్రల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శివప్రతాప్ విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 97.25 శాతం మాత్రల పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. పాఠశాలకు గైర్హాజరు అయిన విద్యార్థులకు ఈ నెల మాప్ ఆఫ్ రౌండ్‌లో మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, డేటా ఎంట్రీ ఆపరేటర్ నరసింహా, ఏఎన్‌యం సలీమా, అంగన్వాడీ టీచర్ ఇర్షాద్‌బేగం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కళ తప్పిన నాటకరంగం

- అలనాటి తోలుబొమ్మలాట, వీధి భాగవతాలకు ఆదరణ కరువు
- జీవనోపాధి కోల్పోయిన కళాకారులు
- పెన్షన్ మంజూరు కాలేదంటూ ఆవేదన


తోలుబొమ్మలాటలో ప్రదర్శించే తోలుబొమ్మలు

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల క్రితం ప్రజలకు వినోదాన్ని పంచిపెట్టింది తోలుబొమ్మలాట.తొలుబొమ్మలాట, నాటక ప్రదర్శన అన్నా ప్రజలు తమ పనులను వదిలి చూసేందుకు వెళ్లేవారు. కళాకారులు కూడా వైభవంగా వెలుగుతూ ఉండేవారు. కాలక్రమేణా సినిమాలు, సీరియళ్లు మొదలయ్యాక నాటకరంగం ఆదరణ కోల్పోయింది. ప్రస్తుత ఆధునిక యుగంలో నాటకరంగం పూర్తిగా అంతరించిపోయింది. దీంతో పూర్తిగా కళాకారులు నాటక ప్రదర్శనలు లేక ప్రభుత్వాల నుంచి ఆదరణ కరువై జీవచ్ఛవంలా బతుకుతున్నారు. ఈ క్రమంలో బద్వేలు పట్టణ సమీపంలోని చెన్నంపల్లె గ్రామంలో తొలుబొమ్మలాటగాళ్లు, నాటకరంగ కళాకారులుగా ఒక వెలుగువెలిగి, ప్రస్తుతం ఉపాధికోల్పోయిన వారి జీవన శైలిపై ప్రత్యేక కథనం.

తరతరాలుగా నాటకరంగ కళాకారులు

బద్వేలు పట్టణం సమీపంలో ఉన్న చెన్నంపల్లె గ్రామంలో తరతరాలుగా నాటకరంగ కళాకారులు కొనసాగుతున్నారు. తోలుబొమ్మలాట, వీధి బాగవతాలు,భారతం వంటి నాటకాలను ప్రదర్శిస్తూ జీవనాన్ని కొనసాగించారు. ఒకప్పుడు నాటకరంగానికి మంచి ఆదరణ ఉన్నప్పుడు వెలిగిపోయిన ఆకుటుంబాలు, ప్రస్తుతం జీవనాన్ని కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాయి.

మహారాష్ట్ర నుంచి వలస

మహారాష్ట్రలోని మరాఠాకులానికి చెందిన కాళే అప్పారావు కుటుంబీకులు కొన్నివందల సంవత్సరాల క్రితం కడప జిల్లాకు వలసవచ్చారు. ఉమ్మడి కడపజిల్లాలోని ఒంటిమిట్ట సమీపంలోని సీతాపురం గ్రామంలో స్థిరపడగా, అక్కడి నుంచి బద్వేలు పట్టణ సమీపంలోని చెన్నంపల్లెకు మరికొన్ని కుటుంబాలు వచ్చి స్థిరపడ్డాయి. అప్పటి నుంచి నాటకరంగాన్నే నమ్ముకొని నాటకప్రదర్శనలు ఇస్తూ ప్రేక్షకులకు వినోదాన్ని పంచిపెడుతున్నారు. కుటుంబంలో పెద్దలందరూ చనిపోగా, ప్రస్తుతం కాళే శ్రీనివాసరావు, వనపర్తి శాంతిరావు కుటుంబసభ్యులు ప్రస్తుతం నాటకప్రదర్శనలను కొనసాగిస్తున్నారు.


తోలుబొమ్మలాటలో అందవేసిన చెయ్యి

అంతరించిపోయిన తొలుబొమ్మలాటలో చెన్నంపల్లె గ్రామానికి చెందిన కుమార వెంకటయ్య పూర్వీకులు అందెవేసిన చెయ్యిగా పేరుగాంచారు. తోలుబొమ్మలాటలో కుమార క్రిష్ణారావు, వెంకటరావు, సుబ్బారావు తదితరులు రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చినట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. వారి వారసులు కుమార వెంకటయ్య ప్రస్తుతం కూడా తోలుబొమ్మలాట ప్రదర్శనలనే నమ్ముకొని జీవిస్తున్నారు. అయితే తోలుబొమ్మలాట ప్రదర్శనలకు ఎక్కడా ఆదరణ లేకపోవడంతో ప్రస్తుతానికి ఇంటి వద్దే ఖాళీగా ఉన్నారు.

పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు

రాయలసీమలోని కడప, చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాలేకాక, నెల్లూరు, ప్రకాశం, క్రిష్ణా జిల్లాల్లో నాటకప్రదర్శనలు చేశామంటున్నారు చెన్నంపల్లె కళాకారులు. అప్పట్లో తమ నాటకప్రదర్శనలను చూసేందుకు తండోప తండాలుగా ప్రజలు వచ్చేవారని, ప్రస్తుతం నాటక ప్రదర్శనలు ఉన్నా, వయస్సు పైబడిన వృద్ధులు, మధ్యవయస్కులు తప్ప కుర్రకారుకు నాటక ప్రదర్శనపై ఆసక్తిలేదంటున్నారు.


ప్రభుత్వం ఆదుకోవాలి



నాటకరంగానికి ప్రస్తుతం ఆదరణ లేకపోవడంతో కుటుంబపోషణకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తర తరాలుగా నాటకరంగాన్నే నమ్ముకొని జీవిస్తున్నాం. ప్రస్తుతం జీవనానికి ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం కళాకారులను ఆదుకోవాలి. కళాకారుల పెన్షన్ మంజూరైతే కొంత మేర ఇబ్బందులు తొలుగుతాయి.

- కాళే శ్రీనివాసరావు, నాటకరంగ కళాకారుడు, చెన్నంపల్లె.


కళాకారులకు పెన్షన్ మంజూరు కాలేదు



ఎన్నో ఏళ్లుగా నాటకరంగాన్నే నమ్ముకొని జీవిస్తున్నాం. ఇన్నేళ్లుగా కళారంగానికి సేవచేసినా మాకు కళాకారులకు ఇచ్చే పెన్షన్ మంజూరు కాలేదు. ప్రభుత్వం కళాకారుల పెన్షన్‌ను మంజూరు చేయాలి.

- కాళే మౌలమ్మ, మహిళా కళాకారిణి, చెన్నంపల్లె.

ఆదరణ కోల్పోయాం ఆదుకోండి




తాత ముత్తాల కాలం నుంచి తోలుబొమ్మలాటనే నమ్ముకొని జీవిస్తున్నాం. ప్రస్తుతం తోలుబొమ్మలాట పూర్తిగా ఆదరణ కోల్పోయి అనేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం కళాకారులకు చేయూతనందించాలి. కళాకారుల పెన్షన్ మంజూరైతే జీవనానికి ఇబ్బంది కలగదు.

-కుమార వెంకటయ్య,
తోలుబొమ్మలాట కళాకారుడు, చెన్నంపల్లె.

ఉద్యోగ నియామకాల్లో ఇష్టారాజ్యం

- ప్యాక్స్‌లో అమలుకాని రోస్టర్
- నష్టపోతున్న బలహీన వర్గాలు



కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో భారత రాజ్యాంగం ప్రకారం పక్కాగా రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉంటుంది. కానీ కొన్ని శాఖల్లో ఈ విధానం అమలు కానట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పలు శాఖల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో చేపట్టే ఉద్యోగ నియామకాల్లో సక్రమంగా రిజర్వేషన్లను అమలు చేయలేకపోవడంతో బలహీనవర్గ ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే సహకారశాఖలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలలో (పీఏసీఎస్) ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేసే క్రమంలో పక్కాగా రోస్టర్‌ను అమలు చేయకపోవడంతో రిజర్వేషన్లు అమలు కావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతాంగానికి సేవలందించేందుకు సహకార శాఖ ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలను నిర్వహిస్తోంది. ఇందులోని సిబ్బందిని పాలక వర్గం నియమించాల్సి ఉంటుంది. అయితే పలుచోట్ల నియామకాల్లో రోస్టర్ పద్ధతిని అమలు చేయకపోవడం, తమ అనుయా యులను నియమించుకోవడం కోసం పాలకవర్గాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. సొసైటీలో పనిచేస్తున్న సిబ్బంది పదవీ విరమణ చెందితే ఆ ఖాళీలను భర్తీచేసే క్రమంలో కొన్నిచోట్ల అక్రమాలకు కూడా పాల్పడుతున్నట్లు చర్చ సాగుతోంది.

నిబంధనలకు నీళ్లు

జిల్లాలో గత కొంతకాలంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల్లో చేపడుతున్న నియామకాల్లో నిబంధనలు పాటించడం లేదని సమాచారం. 1964లోని రూల్ 5లోని 24వ ఉప నిబంధన ప్రకారం కాకుండా రిక్రూట్‌మెంట్ పద్ధతిని ఇష్టానుసారంగా చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఏదైన ఒక ఖాళీని భర్తీ చేసేందుకు మొదట తాత్కాలిక పద్ధతిన నియమించి ఆ తర్వాత క్రమబద్ధీకరణ చేయాల్సి ఉంటుంది. ఈ వ్యవహారం అంతా జిల్లాస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీ ద్వారా చేపట్టాల్సి ఉంది. ఇదిలా ఉంటే రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు వారి వ్యాపార స్థాయిల ప్రకారం ఉద్యోగులను నియమించుకోవాల్సి ఉంటుంది. పీఏసీఎస్‌లలో ఒక సీఈఓ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ క్యాడర్, సబ్ స్టాఫ్ క్యాడర్‌గా పోస్టులను విభజించారు. ఇందులో సీఈఓ పోస్టుకు ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ చేసి ఉండాలి. అదేవిధంగా కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ పాసై ఉండాలి. కంప్యూటర్ నాలెడ్జ్ తప్పనిసరిగా ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ స్టాఫ్‌కు కంప్యూటర్ ప్రావీణ్యంతో పాటు డిగ్రీ ఉత్తీర్ణత తప్పనిసరి. సబ్‌స్టాఫ్ పోస్టులకు సంబంధించి 10వ తరగతి ఉత్తీర్ణత సాధించాల్సి ఉంది. ఏదైన ఒక సొసైటీలో ఖాళీలు ఏర్పడితే వాటి నియామకానికి పీఏసీఎస్ తరఫున జిల్లాస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీకి నివేదించాల్సి ఉంది. ఒక జిల్లాలోని సొసైటీలో ఏర్పడే సీఈఓ పోస్టులకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులలో ఉన్న వారి ద్వారా 25శాతం మేర ఖాళీలు భర్తీచేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఆ పోస్టుకు అర్హులైన వారు సొసైటీలో లేకపోతే సొసైటీ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీ ద్వారా ఖాళీలను నేరుగా భర్తీచేసేందుకు రాష్ట్ర స్థాయి కార్యనిర్వాహక కమిటీ అనుమతి తీసుకోవాల్సి ఉంది. ఇదిలా ఉంటే ప్రతి ఐదేళ్లకు ఒకసారి సీఈఓలు, ఎగ్జిక్యూటివ్ స్టాఫ్‌కు బదిలీలు తప్పనిసరి. జిల్లాలోని కొన్ని సొసైటీలలో అర్హులు ఉన్నప్పటికీ వారికి పదోన్నతి కల్పించేందుకు పాలకవర్గాల పెద్దలు సహకరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కొన్నిచోట్ల అక్రమాలు చోటుచేసుకున్నట్లు కూడా చర్చ సాగుతోంది.

పాలకవర్గాలు పట్టించుకోకపోవడంతో...

సొసైటీలోని సీఈఓలు సబ్ ఎగ్జిక్యూటివ్ స్టాఫ్ పోస్టులు మినహా సబ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి నియామకాలు చేపట్టడం తప్పనిసరి. సాధారణంగా సబ్‌స్క్రైబ్ పోస్టుల రిక్రూట్‌మెంట్ కోసం స్థానిక ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ద్వారా వచ్చిన జాబితా ఆధారంగా నియామకాలు జరపాల్సి ఉంటుంది. అయితే ఇప్పటి వరకు చేపట్టిన చాలా వరకు సొసైటీల్లో ఇవేవీ పాటించనట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం ఖాళీల భర్తీలో రోస్టర్‌ను అమలు చేయాల్సి ఉండగా పాలకవర్గాలు పట్టించుకోకపోవడంతో అర్హులైన బడుగు బలహీన వర్గాల ప్రజలు నష్టపోతున్నట్లు సమాచారం. ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ద్వారా వచ్చిన జాబితాతో పాటు సొసైటీ కార్యకలాపాల ప్రాంతం నుంచి వచ్చిన వ్యక్తులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో ఏ ఏ పోస్టు లు ఉండే విషయం కూడా ఎవరికీ అంతుచిక్కని విషయం. దీంతో అక్కడ పోస్టుల భర్తీ గురించి కూడా పెద్దగా ఎవరికి అవగాహన లేకపోవడంతో కొన్ని సొసైటీల్లోని సిబ్బంది పాలకవర్గాల కనుసన్నల్లో నియామక వ్యవహారం జరిగిపోతున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో 77ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పనిచేసేవి. జిల్లా విభజన తర్వాత వాటి సంఖ్య 51కి పడిపోయాయి. ఇప్పటి వరకు ఎన్ని సొసైటీల్లో ఖాళీలు ఉన్నాయనే విషయం కూడా జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌కి సమాచారం లేదు. దీన్ని బట్టి చూస్తే సొసైటీల ఉద్యోగుల ఖాళీలు భర్తీలో సహకార చట్టంలోని నిబంధనలు పాటించడం లేదనేది స్పష్టమవుతుంది.

ఎటువంటి లేఖలు అందలేదు



ఈ విషయమై జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్‌కుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. సాధారణంగా ఒక పోస్టుకు 20 మంది లెక్కన జాబితా అడుగుతారు. అయితే ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో ఖాళీల భర్తీకి సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి లేఖలు మాకు అందలేదు.

పేదల గుడిసెలు తొలగింపు సమంజసమా?

- ఎమ్మెల్యే సుధ వ్యాఖ్యలపై సీపీఐ నేతల మండిపాటు



అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

బద్వేలు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : గోపవరం మండలం పీపీకుంట వద్ద నిరుపేదలు వేసుకున్న గుడిసెలు తొలగించాలని ఎమ్మెల్యే సుధ జిల్లా పరిషత్ సమావేశంలో పేర్కొనడం సరికాదంటూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ మాట్లాడుతూ పేదలకు అండగా ఉండాల్సిన ఎమ్మెల్యే వారి గుడిసెలను తొలగించాలనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గుడిసెలు వేసుకుని రోడ్డు, తాగునీటి సౌకర్యం లేకపోయినా ఏడాదికాలంగా జీవనం సాగిస్తున్నామని.. ఈ స్థలాన్ని వైసీపీ నాయకులకు కట్టబెట్టాలని చూడడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే పేదలకు అండగా నిలవాలే తప్ప వారి భూముల జోలికి వస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో పీవీ రమణ, పడిగె వెంకటరమణ, పెంచలయ్య, ఇమ్మానుయేల్, ఖాదర్‌బాష, వెంకటయ్య, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

సూర్యనమస్కార ప్రదర్శనలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థికి తృతీయ బహుమతి



బహుమతి అందుకుంటున్న ట్రిపుల్‌ఐటీ విద్యార్థి విజయ్

వేంపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిద్దిపేటలో ఇటీవల నిర్వహించిన శత సహస్ర సూర్యనమస్కార ప్రదర్శనలో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థి విజయ్ తృతీయస్థానంలో నిలిచాడు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు 1456 సూర్యనమస్కారాలు ఏకధాటిగా పూర్తి చేశాడు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 1500 మంది పాల్గొని ట్రిపుల్‌ఐటీ విద్యార్థి తృతీయ బహుమతి పొందాడు. పట్టుదల, క్రమశిక్షణ, మానసిక స్థిరత్వాన్ని ప్రదర్శించి సూర్యనమస్కారాలు చేయడం అభినందనీయమని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ రవికుమార్‌లు అన్నారు.

రోడ్డు పనులను అడ్డుకున్న జీవిసత్రం వాసులు



రోడ్డు పనులను అడ్డుకుంటున్న జీవీ సత్రంవాసులు

మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గుత్తి - కృష్ణపట్నం నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులను మండలంలోని జీవి సత్రం వద్ద సోమవారం ఆ గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. బద్వేలు రోడ్డు నుంచి తమ పొలాలకు వెళ్లే దారి లేకుండా రోడ్డు నిర్మిస్తున్నారంటూ పనులు చేపట్టకుండా అడ్డగించారు. దీంతో రోడ్డు పనులకు సంబంధించిన అధికారులు వచ్చి యాజమాన్యంతో మాట్లాడి దారి ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

పులివెందులలో ఘర్షణ

- తాగిన మత్తులో ఓ నాయకుని కొడుకు హల్‌చల్

పులివెందుల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో పడగొట్టిన బస్టాండ్ సమీపంలో ఘర్షణ చోటుచేసుకుంది. తాగిన మత్తులో ఓ పార్టీకి చెందిన నాయకుడి కొడుకు హల్‌చల్ చేశారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాల్లోకెళితే... అనంతపురం జిల్లా తాడిమర్రి మండలం తిమ్మాపురానికి చెందిన వారు కడప వైపు నుంచి కారులో బస్టాండ్ సమీపానికి చేరుకున్నారు. కారుకు పాదచారి అడ్డురావడంతో కారు ఒక్కసారిగా బ్రేక్ వేశారు. కారు వెనుకలే వస్తున్న ఓ నాయకుడి కొడుకు బైకుపై వచ్చి కారును వెనుకవైపున ఢీకొట్టాడు. ఉన్నట్లుండి కారు ఆపితే వెనుకవచ్చేవారు ఏమవుతారని వారిపై మండిపడ్డారు. వెంటనే కారు నడుపుతున్న వ్యక్తిపై దాడికి దిగాడు. కారులో ఉన్న వారు ప్రతిఘటించినా వారిపై కూడా దాడికి ప్రయత్నించాడు. ఇంతలో అటుగా వెళ్తున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఏమి జరిగిందని ఆరా తీసేలోపు ఆ యువకుడు కారులో ఉన్న వారిపై మరోసారి దాడికి ప్రయత్నించడంతో పోలీసులు ఆ యువకుడిని గట్టిగా ప్రతిఘటించారు. దీంతో ఆ యువకుడు సహనం కోల్పోయి పోలీసులపై కూడా దురుసుగా ప్రవర్తించాడు. దీంతో పోలీసులు అతడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆ యువకుడు కారులో ప్రయాణిస్తున్న వారికి జరిగిన సంఘటన విషయమై అతని బంధువులు, యువకుడు సర్దిచెప్పడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు.

కోవరంగుట్టపల్లిలో ఉద్యోగి ఆత్మహత్య.



పెద్దన్న (ఫైల్‌ఫొటో)

సింహాద్రిపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవరంగుట్టపల్లిలో సోమవారం చింతపండు పెద్దన్న (55) అనే ఉద్యోగి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెద్దన్న తొండూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో క్లర్క్‌గా విధులు నిర్వహించేవాడు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దన్న మృతిపై ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ట్రాక్టర్ డ్రైవర్ మృతి

సికెదిన్నె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురైన ట్రాక్టర్ డ్రైవర్ కుప్పాల జనార్దన్ (32) ఆదివారం రాత్రి మృతి చెందినట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. సిద్దవటం మండలం పాలకొండ్రాయునిపల్లెకు చెందిన జనార్ధన్ 6వ తేదీ ఉదయం జమాల్‌పల్లె వద్ద ట్రాక్టర్‌ను లారీ వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. కడప రిమ్స్‌లో చికిత్స పొందు తూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తల్లి కుప్పాల యల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

13 మంది జూదరుల అరెస్టు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం 34వవార్డు దేవాంగపేటలోని జ్యోతి నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఓ ఇంటిలో జూదం ఆడుతున్న 13 మంది పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.65,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన జూదరులలో పోసా శ్రీనివాసులు అలియాస్ ఉంగరాల శ్రీను, హరీష్, మచ్చా నాగేంద్ర, కాళహస్తి శేష తదితరులు వున్నారు. వీరిపై కేసు నమోదు చేసి వ్యక్తి గత పూచికత్తుపై విడుదల చేసినట్లు ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

లాడ్జీలలో పోలీసుల తనిఖీ



కడప క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా సోమవారం సాయంత్రం పోలీసులు లాడ్జీల తనిఖీ చేపట్టారు. లాడ్జిల్లో పోలీసులు ప్రతి గదిని క్షుణ్ణంగా పరిశీలించి బస చేసిన వ్యక్తులను ప్రశ్నిస్తూ వారి వివరాలపై ఆరా తీశారు. అనంతరం లాడ్జిల్లోని రిజిస్టరును పరిశీలించారు. లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లాడ్జిల నిర్వాహకులు అనుమానితులను గుర్తిస్తూ వెంటనే పోలీసులకు సమాచరం అందివ్వాలన్నారు. లాడ్జీ పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

యువతి అదృశ్యం



కడప క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బుడ్డాయపల్లెలోని టెలికాంనగర్‌లోని ఆదర్శనగర్‌కు చెందిన చింతకుంట భవిష్య (30) అనే యువతి అదృశ్యమైనట్లు రిమ్స్ పోలీసుస్టేషన్ ఎస్ఐ తెలిపా రు. యువతి బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు మోదు చే సి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 9121100523, 9121100524 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా సైన్స్‌డే

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా సైన్స్ దినోత్సవం ఉండాలని యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలో డీన్‌లు, అన్ని శాఖల విభాగాధిపతులతో సైన్స్ దినోత్సవ నిర్వహణపై సోమవారం ఉపకులపతి తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. 28వ తేదీ సైన్స్ డే నిర్వహణపై అభిప్రాయాలను స్వీకరించారు. దేశంలో ప్రఖ్యాతిగాంచిన సైన్స్ పరిశోధకులను ఆహ్వానించి ఉపన్యాసం ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే విద్యార్థుల్లో, పరిశోధకులలో లోతైన పరిశోధన అవగాహన కోసం పోస్టర్ ప్రజెంటేషన్ చేయనున్నారు. ఇందులో అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, డీన్‌లు ఆచార్య ఏజీ దాము, ఆచార్య కె.గంగయ్య, అన్ని శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

వైవీయూ దూరవిద్యలో కూచిపూడి భరతనాట్యం సర్టిఫికెట్ కోర్సులు

యోగివేమన విశ్వవిద్యాలయంలో దూరవిద్య కేంద్రం (సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్) ద్వారా కూచిపూడి, భరతనాట్యం కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నారు. ఈ మేరకు వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి సమక్షంలో కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, డాక్టర్ శ్రీధర్‌బాబు, ధర్మవరం కూచిపూడి కళా కేంద్రం కార్యదర్శి కె.ఎల్.కళ్యాణ్ చక్రవర్తి, అధ్యక్షులు కె.మంజుల, గౌరవ సలహాదారు నటరాజ కృష్ణమూర్తి సంతకాలు చేశారు. వీసీ మాట్లాడుతూ ఈ ఎంఓయు ద్వారా ఏడాది వ్యవధి గల సర్టిఫికేట్ కోర్సులు దూరవిద్య ద్వారా అందుబాటులోకి వస్తాయన్నారు. కళారంగాన్ని ప్రోత్సహించేందుకు ఈ కోర్సులను దూరవిద్య ద్వారా అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు పాల్గొన్నారు.



డిగ్రీ పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ పద్మ

డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్,ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ 1,3,5 సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రధానాచార్యులు ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావుతో కలిసి విడుదల చేశారు. సోమవారం వైవీయులోని తమ చాంబర్‌లో ఫలితాలను వీసీ పరిశీలించారు. ఫస్ట్ ఇయర్‌లో 63.36శాతం, మూడో సెమిస్టర్‌లో అన్ని గ్రూపులు కలుపుకొని 63.39శాతం ఫలితం నమోదైందన్నారు. ఐదో సెమిస్టర్‌కు సంబంధించి అన్ని గ్రూపులు కలిపి 77.83శాతం ఫలితాలు నమోదయ్యాయన్నారు. సహ పరీక్షల అధికారులు డాక్టర్ మమతకుమారి, డాక్టర్ కనుసు శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళల హాకీ చాంపియన్ కడప

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 15వ ఏపీ సీనియర్ మహిళా హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో కడప జిల్లా జట్టు విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో అనంతపురం, కడప జట్లు తలపడగా కడప జట్టు ఉత్తమ ప్రదర్శనతో 2-0 గోల్స్ తేడాతో ఛాంపియన్‌గా నిలిచింది. అనంతపురం ద్వితీయస్థానం సాధించింది. అలాగే మూడు, నాలుగు స్థానాల కోసం జరిగిన మ్యాచ్‌లో కాకినాడ, అనకాపల్లి జట్లు తలపడగా కాకినాడ 7-1 గోల్స్‌తో మూడో స్థానంలో నిలిచింది. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణిక్యరాజు, కార్యదర్శి హర్షవర్ధన్, కోశాధికారి థామస్‌పీటర్ విజేతలకు బహుమతులు అందచేశారు. ప్రథమస్థానంలో నిలిచిన కడప జట్టుకు ట్రోఫీతోపాటు రూ.7వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన అనంతపురం జట్టుకు ట్రోఫీ, రూ.5వేలు, తృతీయస్థానంలో నిలిచిన కాకినాడ జట్టుకు ట్రోఫీ రూ.3వేలు నగదు అందచేశారు. అలాగే ఉత్తమ గోల్‌కీపర్‌గా నిలిచిన ప్రకాశం జిల్లా క్రీడాకారిణి నందినికి, ఉత్తమ క్రీడాకారిణిగా నిలిచిన కాకినాడ క్రీడాకారిణి వరలక్ష్మికు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అనంతపురం జిల్లా క్రీడాకారిణి లక్ష్మీలకు నగదు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ జోనాథాన్, సీనియర్ క్రీడాకారులు నవీన్, పోటీల నిర్వాహక కార్యదర్శి థామస్‌పీటర్, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి జగన్మోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు జీడీ.సురేష్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



చాంపియన్‌గా నిలిచి కప్ అందుకుంటున్న కడప జిల్లా జట్టు

ఆర్టీపీపీలో దొంగల బీభత్సం

- రూ.1.30 లక్షలు నగదు, 5తులాల బంగారు, కేజిన్నర వెండి చోరీ

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. కాలనీ నడిబొడ్డులో ఏఈలు నివాసం ఉండే ఈ బ్లాక్‌లో ఈ చోరీలకు పాల్పడ్డారు. వివరాలిలా... ఆర్టీపీపీలో ఇంజినీర్స్ నివాసం ఉండే 'ఈ' టైప్ క్వార్టర్స్ ఈ 338, 96, 112, 207, 213, 214 క్వార్టర్స్‌లో ఇళ్ల తాళం కింద వుండే కొండీని తొలగించి చోరీ చేశారు. 338 ఇంటిలో ఉంటున్న ఏఈ పద్మజ శుక్రవారం సాయంత్రం కుటుంబంతో కలసి పులివెందులకు వెళ్లింది. చోరీ జరిగినట్లు సమాచారం రావడంతో ఆమె సోమవారం ఉదయం హుటాహుటిన ఆర్టీపీపీకి వచ్చారు. ఇంట్లో బీరువాలో ఉంచిన రూ.1.30లక్షల నగదు, 5తులాల బంగారు ఆభరణాలు, వెండి చెంబు, ప్లేటు, ఇతర వెండి వస్తువులు చోరీ చేసినట్లు గుర్తించారు. అలాగే మరో ఐదిళ్లలో కూడా చోరీ చేశారు. అయితే అక్కడ విలువైన వస్తువులు ఏవీ దొంగలకు దొరకలేదు. ఒక ఇంట్లో బంగారు, డబ్బు వున్నప్పటికి దొంగల కంట పడలేదు. మరో ఇంట్లో రూ.15వేల వరకు నగదు చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. ఈ చోరీల విషయం తెలుసుకున్న జమ్మలమడుగు డీఎస్పీ వేంకటేశ్వర్లు సీఐ రఫీతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. చోరీ జరిగిన క్వార్టర్స్ లోకి వెళ్లి పరిశీలించారు. కడప నుంచి వచ్చిన క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించారు. అనంతరం డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కాగా, ఆర్టీపీపీలో జరిగిన చోరీపై డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల ముఠా చేసి వుంటుందన్న అను మానం వ్యక్తం చేశారు. దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక టీంఎం ఏర్పాటు చేశామని వివరించారు.



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న డీఎస్పీ



డాగ్ స్క్వాడ్ తనిఖీలు

'ఆప్కాస్ రద్దు విషయాన్ని మానుకోవాలి'

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ రద్దు విషయాన్ని ప్రభుత్వం మానుకోవాలని కడప జీజీహెచ్ వద్ద ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య కోరారు. సోమవారం రిమ్స్‌లోని ఆప్కాస్ ఉద్యోగస్తులతో నిరసన చేపట్టారు. ఆప్కాస్ విధానం వల్ల కార్మికులకు నెలనెల వేతనాలు వస్తున్నాయన్నారు. పీఎఫ్ ఈఎస్ఐ సక్రమంగా అమలవుతోందన్నారు. కాగా కడప జీజీహెచ్‌లో శానిటేషన్ సెక్యూరిటీ సబ్ కాంట్రాక్ట్ జె.బాలనారాయణరెడ్డి శానిటేషన్ సెక్యూరిటీ కార్మికులకు జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదన్నారు.

'విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రత్యేక కమిటీ వేయాలి'



మాట్లాడుతున్న బీజేవైఎం నాయకులు

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రత్యేక కమిటీ వేయాలి వేయాలని భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) జాతీయ నాయకులు బత్తల పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎన్‌జీవో కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోయా యన్నారు. విద్యాశాఖ అధికారులు ప్రైవేటు విద్యాసంస్థలు ఇచ్చే మామూళ్ల మ త్తులో జోగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, కోశాధికారి శ్రీకాంత్, నాయకులు షేక్ ఇలియాజ్ పాల్గొన్నారు.

లయన్ ఖాసీం ఖాన్‌ను సత్కరించిన రచయితలు



కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కడపలోని జీఎంఏ హాలులో ఆదివారం సాయంత్రం లయన్ పి.ఖాసీంఖాన్‌ను వైఎస్సార్ జిల్లారచయితల సంఘం ఘనంగా సన్మానించారు. రెండు రెజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులు, రచయితలు, కవులు ఘనంగా ఖాసీంఖాన్‌ను సత్కరించారు. లయన్ ఖాసీంఖాన్ భోజన సౌకర్యాలను తన పేరిట స్థాపించిన చాంద్‌బీ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఏర్పాటు చేశారు. అందుకు గౌరవప్రదంగా రచయితల సంఘం ఖాసీంఖాన్‌ను ఘనంగా సన్మానించారు.

విద్యాసామగ్రి పంపిణీ

లింగాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): లింగాల ఉన్నత పాఠశాలలో లోపట్నూతల గ్రామ టీడీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి, టీడీపీ మండల నాయకులు దేవిరెడ్డి సంజీవరెడ్డి, విశ్వనాథరెడ్డిల ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రిని సోమవారం పంపిణీ చేశారు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్‌రవి జన్మదినం సందర్భంగా విద్యార్థులకు విద్యాసామాగ్రి అందించారు. అనంతరం బస్‌స్టాండ్‌లో కార్యకర్తల మధ్య కేక్ కట్ చేశారు.

వేడుకగా ప్రారంభమైన చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు



యాగం నిర్వహిస్తున్న వేద పండితులు

వల్లూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర పాపాఘ్నినదీ తీరాన మండల పరిధిలోని పైడికాల్వ గ్రామంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున సుప్రభాత సేవ, అనంతరం గోపూజ నిర్వహించి మంటపారాధన చేశారు. స్వస్తి పుణ్యహవచనం, గణపతిపూజ చేసి ఆచార్యాది రుత్విగ్వరణంలతో పూజలు ప్రారంభించారు. అనంతరం ప్రధాన కలశస్థాపన నిర్వహించి ఇందులో రాజ్యలక్ష్మీసమేత చెన్నకేశవస్వామి స్వరూపాలను ఆదిత్యాదినవగ్రహ దేవతలను, అష్టదిక్పాలక పూజలు ఆ కలశాల్లో వేదపండితులు ఆవాహణం చేశారు. తదనంతరం పూజలకు మొట్టమొదటి ఆరాధ్యుడు విఘ్నాలకు అధిపతి అయిన విఘ్నేశ్వరుడు (అనంతనాగ విజయగణపతి) పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అగ్నిప్రతిష్ఠగావించి ముందుగా గణపతి సంబంధించి హోమాలను వివిధ పూజా ద్రవ్యాలతో ఆయనకు ప్రీతికరంగా హోమాలు నిర్వహించిన అనంతరం రుద్ర సహిత, పంచ సూక్తవిధానేనా, ఆదిత్యాది నవగ్రహాలను రుద్రహోమాలు నిర్వహించారు.

ఘనంగా పుత్రకామేష్ఠియాగం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు సోమవారం పూజలు నిర్వహించిన అనంతరం అగ్నిప్రతిష్ఠ చేసిన అనంతరం భక్తులచేత పుత్రకామేష్ఠి యాగాన్ని నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమాలు చేపట్టారు.

ఘనంగా బీటెక్ రవి జన్మదిన వేడుకలు





టీడీపీ కార్యాలయం వద్ద రక్తదానం చేస్తున్న కార్యకర్తలు, నాయకులు... నాలుగురోడ్ల కూడలిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

వేంపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) జన్మదిన వేడుకలను వేంపల్లెలో ఘనంగా జరుపుకొన్నారు. పార్టీ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. 20 మంది శిబిరంలో రక్తదానం చేశారు. టీడీపీ యువనాయకులు నామా వేమకుమార్, రాజీవ్‌కాలనీ బుజ్జి తదితరులు రక్తదానం చేశారు. అనంతరం స్థానిక నాలుగురోడ్ల కూడలిలో మండల కన్వీనర్ మునిరెడ్డి, టీడీపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, యువనాయకులు యాసిన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బర్త్‌డే కేక్‌ను కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అనంతరం పులివెందులలో ఉన్న బీటెక్ రవిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో గండి మాజీ చైర్మన్ వెంకటస్వామి, జయరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రామగంగిరెడ్డి, టీడీపీ యువనాయకులు రజనీకాంత్‌రెడ్డి, మండల మాజీ కార్యదర్శి మల్లంగి పాపిరెడ్డి, దేవస్థాన మాజీచైర్మన్ కొండయ్య, మాజీ సభ్యులు పీవీ రమణ, నల్లగారి కృష్ణారెడ్డి, మైనార్టీ నాయకులు తెలంగాణ వలి, మహమ్మద్, మహబూబ్ షరీఫ్, ఫయాజ్, గిడ్డంగివారిపల్లె సుధాకర్‌రెడ్డి,గణేష్‌నాయక్, శంకర్, బాలకృష్ణారెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజీవ్ కాలనీలోని ఆశ్రమంలో ఇలియాస్, శివ తదితరులు అన్నదానం చేశారు. గండి రోడ్డు లోని అనాథ శరణాలయంలో బీటెక్ రవి సతీమణి లతారెడ్డి అనాథలకు బట్టలు పంపిణీ చేసి అన్నదానం చేశారు.



చక్రాయపేటలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

చక్రాయపేటలో సంబరాలు

చక్రాయపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) జన్మదిన వేడుకలు చక్రాయపేట మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. భాస్కర్‌రెడ్డి (ఎల్‌బీఆర్), రమేష్, వెంకటరామిరెడ్డి, టీడీపీ అధికార ప్రతినిధి పట్టెం అశోక్, మునిరెడ్డి, బీసీ నాయకుడు మహదేవపల్లె రమేష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి తినిపించుకున్నారు. శ్రీరామిరెడ్డి, వెంకటేష్, మాజీ సర్పంచు నరసింహులు, సిద్దారెడ్డి, రామకృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమ్మె తాత్కాలిక విరమణ

సర్వేంపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పెంచిన వేతనాలు, పెండింగ్ వేతనాలు, ఈపీఎఫ్ తదితర సమస్యల పరిష్కారానికి వేంపల్లె పారిశుధ్య కార్మికులు ఈఓ సుబ్బారెడ్డికి సమ్మె నోటీసు ఇచ్చారు. గత కొన్ని నెలలుగా అడుగుతున్నా పెంచిన వేతనాలు ఇవ్వడం లేదని, ఈపీఎఫ్, ఎల్ఐసీ సమస్యలు పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పంచాయతీ కార్యాలయానికి వచ్చి సమస్యను ఈఓకు చెప్పుకొని సమస్యలు పరిష్కరించకపోతే పనులు చేయలేమంటూ సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ విషయం ఈఓ సుబ్బారెడ్డి, సర్పంచు శ్రీను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ కార్యాలయానికి వచ్చిన సర్పంచు పారిశుధ్య కార్మికులను పిలిపించి మాట్లాడగా సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో తమ సమ్మె తాత్కాలికంగా నిర్ణయాన్ని విరమించుకున్నారు.

'మున్సిపాలిటీలో టీడీపీ జెండా ఎగురవేస్తాం'



టీడీపీలో చేరిన వారితో బీటెక్ రవి

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పులివెందుల మున్సిపాలిటీలో టీడీపీ జెండా ఎగురవేస్తామని నియోజకవర్గ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి అన్నారు. సోమవారం పెద్దరంగాపురంలో రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, వెన్నపూస విష్ణువర్ధన్‌రెడ్డిల ఆధ్వర్యంలో 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. బీటెక్ రవి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో వెన్నపూస విష్ణువర్ధన్‌రెడ్డి, వెన్నపూస ప్రతాప్‌రెడ్డి, వెన్నపూస చిన్నప్రతాప్‌రెడ్డి, గజ్జల అంకాల్‌రెడ్డి, వెన్నపూస శివరామిరెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, వెన్నపూస రామ్మోహన్‌రెడ్డి, వెన్నపూస రామక్రిష్టారెడ్డి, రామచంద్రారెడ్డి, శివకామేశ్వర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, వెలుతుర్ల రామాంజనేయులు, జగన్, చంద్రశేఖర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, లక్ష్మిరెడ్డి, క్రిష్టారెడ్డి, గంగాధర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, బారెడ్డి చలమారెడ్డి, కమలాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, అల్లిపీరా, చిలంకూరు జాన్, వేణు, గౌస్, మధు, సోమశేఖర్ తదితరుల కుటుంబాలు ఉన్నాయి. కాగా స్థానిక టీడీపీ కార్యాలయంలో సీ ఎం సహాయనిధి కింద మంజూరైన రూ.14,61,000 చెక్కులను బీటెక్ రవి పంపిణీ చేశారు.



సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలకు అన్నదానం చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి

అర్జీదారులకు న్యాయం జరగాలి: కమిషనర్

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అర్జీదారులకు న్యాయం జరగాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి సూచించారు. సోమవారం కడప కార్పొరేషన్ కార్యాలయం వీడియో కాన్ఫిరెన్స్ హాల్లో జరిగిన ప్రజా పిర్యాదుల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పిర్యాదుల కార్యక్రమంలో 24 మది వారి సమస్యలు పరిష్కరించాలని అర్జీలు సమర్పించారన్నారు. రెవిన్యూకు 9, ఇంజనీరింగ్‌కు 8, టౌన్‌ప్లానింగ్‌కు 6, పబ్లిక్ హల్త్‌కు ఒకటి అర్జీలు వచ్చాయన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి గడువులోగా అర్జీదారులకు న్యాయం చేయాలని సూచించారు.

తంగేడుపల్లెలో ఇసుక రీచ్ ప్రారంభం

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లె మండలంలోని తంగేడు పల్లెలో సోమవారం ఇసుక రీచ్‌ను ప్రారంభించినట్లు మైన్స్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ సూర్యచంద్రరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీడీ ఆ ప్రకటనలో కోరారు.

దొంగతనాలను కట్టడి చేద్దాం: ఎస్ఐ

కడప క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) :దొంగతనాలను కట్టడి చేద్దామని చిన్నచౌకు ఎస్ఐ రవికుమార్ ప్రజలకు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు దొంగతనాలను అరికట్టేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలకు సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇంటికి తాళాలు వేసి వెళ్లేటప్పుడు సమీప పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. బంగారు, వెండి తదితర వస్తువులు బ్యాంకు లాకర్‌లో భద్రపరచుకోవాలన్నారు.

అమెరికా చర్య శోచనీయం: డీవైఎఫ్ఐ

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అమెరికా నుంచి వందలాది మంది భారతీయులను బహిష్కరించడాన్ని ఖండిస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కడప అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, నగర నాయకులు నిర్మల్, రాజేష్, రవీంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ ఉదయభారతి ఒక ప్రకటనలో కోరారు. 202-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్ ఇంగ్లీష్ మీడియం ప్రవేశాల కోస బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి 6వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 6న ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు.

నందిపల్లె వద్ద ఎక్స్‌ప్రెస్ బస్‌స్టాప్

వేంపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మండలంలోని నందిపల్లె గ్రామం వద్ద కడప-పులివెందుల ప్రధానరోడ్డుపై ఎక్స్‌ప్రెస్ ఆర్టీసీ బస్సుల స్టాపింగ్‌కు కడప ఆర్టీసీ రీజనల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల నందిపల్లెకు చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పందిళ్లపల్లె రామగంగిరెడ్డి పులవెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ద్వారా రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

ఇమామ్, మౌజన్లకు వేతనాలు చెల్లించాలి

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం చెల్లించాలని కోరుతూ సోమవారం ఆప్ కీఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్రీవెన్‌సెల్‌లో జేసీకి వినతిపత్రం సమర్పించారు. జేసీ స్పందిస్తూ సమాచారాన్నిరాష్ట్రం దృష్టికి తీసుకెళ్తామని గౌరవ వేతనం అందేలా సంబంధిత అధికారులతో చర్చిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వల్లూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ రోషన్ తెలిపారు. సోమవారం ఎస్పీ ఆదేశాల మేరకు మండల పరిధిలోని ప్రజలకు సీఐ ఆధ్వర్యంలో చైన్ స్నాచింగ్, ఇళ్లల్లో దొంగతనాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలను ఆదమరిచి చైన్ స్నాచింగ్ జరుగుతోందని, వాటిని రూపు మాపేందుకే అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు బయటికి వెళ్లేటప్పుడు, ఆభరణాలు ధరించినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆధార్ సెంటరు ఏర్పాటు చేయాలి

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కమలాపురం మండల హెడ్‌క్వార్టర్‌లో శాశ్వత ఆధార్ సెంటరును ఏర్పాటు చేయాలని మన ఊరు సేవా సమితి అధ్యక్షుడు శీలం శ్రీనివాసులు, రవి, విల్సన్ నగర పంచాయతీ కమిషనరు పగడాల జగన్నాథంకు వినతిపత్రం అందించారు. ఈ ప్రాంతంలో ఒక్క శాశ్వత ఆధార్ కేంద్రం కూడా లేకపోడం బాధాకరమన్నారు.

'వాటర్ ప్లాంట్‌ను తొలగించండి'

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మాసాపేటలో నిరుపయోగంగా ఉన్న వాటర్‌ప్లాంట్‌ను వెంటనే తొలగించాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ డిమాండ్ చేశారు. సోమవారం కడప కార్పొరేషన్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో కమిషనర్ మనోజ్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

నిత్యజీవితంలో సైన్స్ భాగం కావాలి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సైన్స్ నిత్యజీవితంలో భాగం కావాలని కవి పిళ్లా కుమారస్వామిరెడ్డి తెలిపారు. సోమవారం జన విజ్ఞాన వేదిక, కడపలోని ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు శాస్త్రీయ ఆలోచనపై ఉపన్యాసాన్ని, మ్యాజిక్ షోను, మ్యాజిక్ వెనుక ఉన్న అనేక సైన్స్ సూత్రాలను వివరిస్తూ శాస్త్రీయ దృక్పథం పెంపొందించే విధంగా కార్యక్రమాలను నిర్వహించారు. శాస్త్రీయ ఆలోచన గ్రంథ రచయిత, కవి పిళ్లా కుమారస్వామిరెడ్డి మాట్లాడారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

చక్రాయపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురభి పంచాయతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ సూచనల మేరకు వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సురభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శివప్రసాద్ హాజరయ్యారు.



ఆక్రమణలపై చర్యలు



అక్రమ కట్టడాలను తొలగిస్తున్న అధికారులు

గోపవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వభూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు త్రిభువన్ రెడ్డి అన్నారు. అనుమతులు లేకుండా ఆక్రమణకు గురైన బేస్‌మట్టాలను సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని నాగులచెరువును ఆక్రమించి అక్రమంగా కట్టిన కట్టడాలను కూల్చివేశామన్నారు. మడకలవారిపల్లె సర్వే నెం.24లో చెరువుతొట్టికి సంబంధించి మొత్తం 29 ఎకరాలు అందులో 5 ఎకరాలకు పైగా కబ్జాకు గురైందని దానిలో కొంత భాగంలో నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించామన్నారు. అలాగే ఎవరైనా చెరువులు, వంకలను వాగులను ఆక్రమిస్తే వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పశువులతో పరేషాన్..!

● రహదారులపై హల్‌చల్ చేస్తున్న మూగజీవాలు ● ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు ● వాహన రాకపోకలకు ఇబ్బందులు







జాతీయ రహదారిపై కారుకు అడ్డంగా ఉన్న ఆవులు, మైదుకూరు రోడ్డులో సంచరిస్తున్న గేదెలు , అడ్డంగా ఉన్న కుక్కలు

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధాన రహదారుల్లో మూగజీవాలు హల్‌చల్ చేస్తున్నాయి. ఉదయం మొదలుకొని రాత్రి వరకు రోడ్లపై తిరుగుతూ ట్రాఫిక్‌కు అంత రాయం కలిగిస్తున్నాయి. మేతకోసం డివైడర్లపై పెంచే మొక్కలను మేస్తున్నాయి. పశుయజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిం చడం, అధికారులు పట్టించుకోక పోవడంతో ఇవి రహదారుల్లో వాహనాలకు అడ్డు వచ్చినప్పుడు వాహన దారులు, ప్రజలు ప్రమా దాల భారిన పడుతు న్నారు. అసలే ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. దీనికితోడు పశువులు రోడ్లపైనే సంచరి స్తుండ టంతో వాహనదారులు ఇబ్బం దులకు గురవుతున్నారు. నియోజక వర్గంలోని వివిధ ప్రాంతాల్లో పశు యజమానులు మూగ జీవాలను రోడ్లపైకి విచ్చలవిడిగా వదిలేస్తు న్నారు. నిత్యం ప్రధాన రహదారుల్లో గుంపు లు గుంపులుచేరి వాహనాల రాక పోకలకు అంత రాయం కలిగిస్తు న్నాయి. ముఖ్యంగా బద్వేలు పట్టణంలోని జాతీయ రహదారిలోని మైదుకూరురోడ్డు, నెల్లూరు రోడ్లలో పశువుల తాకిడి అధికంగా ఉంటుంది. పశువులు అడ్డురావడంతో ఇటీవల కొందరు ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాల పాలైనవారు కొందరైతే, మరికొందరు వికలాం గులుగా మిగిలి పోతున్నారు. మరి కొంత మంది మృత్యువాతపడుతున్నారు. గతంలో మున్సిపల్ అధికారులు, పోలీసులు పశుపో షకులకు నోటీసులు ఇచ్చి కట్టడి చేసేవారు. ఆ తరువాత షరామామూలుగా పశుపో షకులు మళ్లీ నిర్లక్ష్యంగా రోడ్లపైకి పశువులను వదిలేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



పట్టణంలో పశువుల సంచారం అధికమైనమాట వాస్తవమే.ఇప్పటికే సంబంధిత పశుయజమానులకు అవగాహన కల్పించాం. అయినా స్పందించలేదు రోడ్లమీదకు రాకుండా చర్యలు తీసుకుంటాం.

నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్

ఆన్‌లైన్ రుణాలపై అవగాహన పెంచుకోవాలి

కాశినాయన ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి) :గ్రామ సమాఖ్య సంఘంలో నడిచే ఆన్‌లైన్ రుణాలపై ఆ సమాఖ్య సంఘం అధ్యక్షులు, ఇతర సభ్యులు అవగాహన పెంచుకోవాలని వెలుగు కార్యాలయ ఏపీయం ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం నర్సాపురంలోని వెలుగు కార్యాలయ సభాభవనంలో గ్రామ సమాఖ్య సంఘం సభ్యులకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటుచేశారు.

జీవో విడుదల చేయాలి



ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉపకార వేతనాలను పెంచుతూ ప్రభుత్వం జీవోను విడుదల చేయాలని పశువైద్య కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం కళాశాల తరగతులు, వైద్యసేవలను బహిష్కరించి కళాశాల ఆవరణలో బైఠాయించి నిరసన చేపట్టారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి సమ్మెపై స్పందించి వెంటనే జీవోను విడుదల చేయాలని కోరారు.

గాయపడిన వ్యక్తి మృతి

దువ్వూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం నేలటూరు గ్రామానికి చెందిన పొలిమేర వెంకటరమణారెడ్డి (34) అనే వ్యక్తి సోమవారం మృతిచెందాడు. ఈనెల 3వ తేదీన నేలటూరు నుంచి ఎర్రబల్లెకు బైకుపై వెళుతూ అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో ప్రొద్దుటూరుకు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఆయన సోదరుడు బ్రహ్మానందరెడ్డి తెలిపారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చేస్తాం

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తాం : ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



ఎర్రచెరువులో చేపపిల్లల్ని వదులుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్,ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి లేకుండా చేస్తామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. స్థానిక ఎర్రచెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం లక్ష చేప పిల్లల్ని వదిలారు. అనంతరం పుట్టా మాట్లాడుతూ గత ఏడాది మైదుకూరు మున్సిపాలిటీలో నాయకుల ముందు చూపు లేక ప్రజలు తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కానీ కూటమి ప్రభుత్వం రాగానే చెరువుల న్నింటినీ నీటితో నింపామని తెలిపారు. చెరువుల్లో కొద్దిగా నీరు తగ్గడం వలన ఎస్‌ఆర్ 2 నుంచి నీటిని మళ్లీ ఈ రోజు వదులుతున్నామని తెలిపారు.అంతేకాకుండా మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రతి సంవత్సరం చెరువుల్లో చేప పిల్లల్ని వదులుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, ధనపాల జగన్,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులరెడ్డి, ఆకులకృష్ణయ్య, పిచ్చపాటి వీరారెడ్డి,ధనపాల రవి, భూమిరెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

లంచం అడగడంపై ఎమ్మెల్యేకి ఫిర్యాదు

మైదుకూరు రూరల్ ,ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : తమ భూములు కొలతలు వేయమంటే మండల సర్వేయర్ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు టీడీపీ నాయకుడు మాదం రమణ సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానిక ఎర్రచెరువులో చేప పిల్లలు వదలడానికి వచ్చిన ఎమ్మెల్యేకు, మాదం రమణ సర్వేయర్ కరీముల్లా భూములు కొలతలు వేయమంటే డబ్బులు అడుగుతున్నారని ఫిర్యాదు చేశారు.ఈ విషయంపై ఎమ్మెల్యే , తహసీల్దార్ రాజసింహ నరేంద్రకు ఫోన్ చేసి మాట్లాడారు. మాదం రమణ విషయం వెంటనే విచారణ చేయాలని ఆదేశించారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ అడుగా మాదం రమణ ఫిర్యాదు చేసిన భూమి సర్వే నెంబరు 63 . రెవెన్యూ రికార్డులో 17 ఎకరాల 57 సెంట్లు మాత్రమే ఉండగా, ఐదు ఎకరాల యాభై సెంట్లు అదనంగా ఉందని తెలిపారు. ఆ భూమి 2017 డిస్‌ప్యూట్ రిజిస్టర్‌లో ఉంచారని తెలిపారు.అది కొలవడానికి ఎవ్వరికీ ఎలాంటి అధికారం లేదని కూడా తెలిపారు. అంతేకాకుండా ఫిర్యాదు దారుడు ఆ సర్వే నెంబర్‌కు ఎలాంటి అర్జీ ఇవ్వలేదు, చలానా కట్టలేదని తెలిపారు. కొలవడానికి వీలులేనందునే సర్వేయర్‌పై అలా నిందలు వేశారని తహసీల్దార్ తెలిపారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయం : భూపేశ్‌రెడ్డి



కందుల కొనుగోళ్లను ప్రారంభిస్తున్న భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు పోతున్నాయని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జమ్మలమడుగులోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ముందుగా జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు గ్రామం రాజీవ్‌నగర్ కాలనీలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని మొక్కుకున్నారు. అనంతరం రాజీవ్‌నగర్ కాలనీలో సమస్యలపై స్థానిక నేతలతో మాట్లాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, చదిపిరాళ్ల పుల్లారెడ్డి, పొన్నతోట శ్రీను, సర్పంచ్ పుల్లారెడ్డి, బాలు, ఖాదర్ పాల్గొన్నారు.

● కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కోవెలకుంట్ల రోడ్డులోని మార్కెట్‌యార్డులో సోమవారం ఏపీమార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోళ్ల కేంద్రాన్ని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవగుడి యూత్ నాగేశ్వర రెడ్డి, జంబాపురం రమణారెడ్డి, పొన్నతోట శ్రీనివాసులు, కొండేటి లక్ష్మణనాయుడు, డీకే కొండారెడ్డి, జగన్, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులు చేరాయంటే అనారోగ్యం దరిచేరినట్టే

మునిసిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : నులిపురుగులు శరీరంలో చేరాయంటే అనారోగ్యం దరిచేరినట్లేనని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. సోమవారం స్థానిక అమృతగార్డెన్స్‌లోని ఎస్‌వీవీ ప్రభుత్వ హైస్కూల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా నులిపురుగులపై అవగాహన కల్పించి ఆల్బెండ జోల్‌మాత్రలు వేశారు. కార్యక్రమంలో వైద్య అధికారి డాక్టర్ భరత్‌నారాయణ ,హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాలరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కవలకుంట్లలో బాలరామస్వామి దేవస్థానంలో సోమవారం సీతారామలక్ష్మణ సమేత ధ్వజశిఖర కలశ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, పంచాయతీరాజ్ మాజీ సలహాదారుడు నాగార్జునరెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, రంగసముద్రం సర్పంచ్ చిత్తారవిప్రకాశ్‌రెడ్డి, లాయర్ ప్రభాకర్‌తో పాటు గ్రామస్థులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆడబిడ్డ పుట్టిందని...

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : భార్య ఆడబిడ్డకు జన్మనిచ్చిందని కాపురానికి తీసుకుపోకుండా మానసికంగా ఇబ్బందులకు గురి చేయడంతో భర్తపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆర్‌వీ కొండారెడ్డి తెలిపారు. పోరుమామిళ్లలోని శీనప్పబావి వీధికి చెందిన శ్రీరామలక్ష్మి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో ఆమె భర్త వెంకటరత్నం కాపురానికి తీసుకుపోకుండా ఇబ్బందులకు గురిచేయడంతో బాధతురాలు భర్త, అత్త, మామ, ఆడపడుచులపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆర్‌వీ కొండారెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఎంపిక



ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై రాయల్‌ఫీల్డ్ కంపెనీలో ఉద్యోగాలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు 178 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జింకా అశోక్‌బాబు తెలిపారు. సోమవారం కళాశాలకు చెందిన మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌ల విద్యార్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 178 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని, వీరికి 20 రోజులపాటు క్షేత్రస్థాయి శిక్షణ ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆతర్వాత ప్రొబేషన్ పీరియడ్ కొనసాగుతుందని ఆ సమయంలో రూ.14 వేల నుంచి రూ.17 వేలు వేతనం ఇస్తారని తెలిపారు. సంవత్సరం తర్వాత ఉద్యోగంలో చేర్చుకుని నెలకు రూ.20 వేలు వేతనం ఇస్తారని ఆయన తెలిపారు.

ఘనంగా మూలమ్మ అమ్మవారి ప్రతిష్ఠ



ఖాజీపేట కాదు — మైలవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దుగ్గనపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మూలమ్మ అమ్మవారి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా వేద పండితులు నిర్వహించారు. అనంతరం అమ్మవారి దర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అమ్మవారిని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చిన్నారులచే చెక్కభజన, కోలాటం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మోటార్ బైక్‌కు నిప్పు.. కేసు నమోదు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : తన పొలాన్ని అడవిజంతువులనుంచి రక్షించుకోవడానికి వెళ్లిన సమయం లో గుర్తు తెలియని వ్యక్తి తన మోటారు బైక్‌కు నిప్పు పెట్టారని సి.శ్రీనివాసులు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. మండలంలోని బూరగమానుపల్లె సమీపంలో శ్రీనివాసులు తన పొలం వద్దకు మోటారు బైక్‌లో వెళ్లాడు. అతను పొలానికి వెళ్లిన సమయంలో దానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని ఫిర్యాదు చేయడంతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో, స్కూటర్ ఢీ - ఒకరికి గాయాలు

ఖాజీపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అయ్యప్పస్వామి గుడి సమీపంలో ఆటో, స్కూటర్ ఢీకొన్న సంఘటనలో రేకలకుంటకు చెందిన సంజీవరాయుడుకు గాయాలయ్యాయి. ఖాజీపేట-నాగసానిపల్లె రహదారిలోని అయ్యప్పస్వామి గుడి సమీపంలో ఖాజీపేట నుంచి రేకలకుంటకు వెళుతున్న స్కూటర్, ఆంజనేయకొట్టాలు నుంచి ఖాజీపేటకు వస్తున్న ఆటోను ఢీకొన్న సంఘటనలో స్కూటరిస్టు సంజీవరాయుడుకు గాయాలయ్యాయి. చికిత్స కోసం 108లో రిమ్స్‌కు తరలించారు.

రూల్స్ మాకు పట్టవ్... మా ఇష్టం



వాసవీ సర్కిల్ వద్ద అడ్డంగా పోతున్న ఇసుక ట్రాక్టర్ (వృత్తంలో)

ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణం లో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల డ్రైవర్లు రూల్స్ మాకు పట్టవు అన్న విధంగా నిర్లక్ష్యంగా ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారు. ప్రొద్దుటూరులోని ఎర్రగుంట్ల బైపాస్‌లో ఉన్న వాసవీ సర్కిల్ వద్ద ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లు అతి వేగంగా రావడంతో పాటు ట్రాఫిక్ రూల్స్ పాటిం చకుండా అడ్డ దిడ్డంగా ట్రాక్టర్లను మలు పుల వద్ద తిప్పుతున్నారు. దీంతో బస్సుల కోసం వాసవి సర్కిల్ వద్ద ఎదురు చూసే ప్రయాణికులు వాపోతున్నారు. ఉదయం పూట అనేక మంది ఉద్యోగ రీత్యా ప్రయాణం చేయడానికి ఈ సర్కిల్ వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్ల ర్యాష్ డ్రైవింగ్‌తో తోటి వాహనాదారులకు, సర్కిల్లో నిరిక్షించే ప్రయాణికులకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ర్యాష్ డ్రైవింగ్ చేసే వాహనాదారులకు, ప్రత్యేకించి ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.